Quran-o-Paighamber
(Telugu)

దివ్య గ్రంథంలో దైవ ప్రవక్త

మూలం:
మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మలై)

అనువాదం:
అబ్దుర్రహ్మాన్

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

దివ్య గ్రంథంలో దైవప్రవక్త

ప్రపంచంలో మానవుని హితబోధకు, మార్గదర్శకత్వానికి ఎల్లప్పుడు పుణ్యపురుషులు జన్మిస్తూ వచ్చారు. వారు తమ మాటలు చేతల ద్వారా మనిషికి సత్యం, ధర్మాల రుజుమార్గాన్ని చూపెడుతూ వచ్చారు. కాని మానవుడు ఈ మహోపకారానికి బదులుగా హింస, దౌర్జన్యాలతోనే సమాధానం ఇచ్చాడు. వారి సందేశాన్ని పెడచెవినపెట్టి, వారి సత్యతను తిరస్కరించి, వారి సందేశాన్ని తృణీకరించి, వారిని అనేక విధాలుగా బాధించి, సత్యమార్గాన్నుండి తప్పించడానికి ప్రయత్నించి వారి ప్రత్యర్థులే వారిపట్ల దౌర్జన్యం చేయడం కాదు, వారిని నమ్మినవారు కూడ వారిపట్ల అన్యాయం చేశారు. వారు గతించిన తర్వాత వారి బోధనల్ని మార్చివేశారు. వారి మార్గదర్శకత్వాన్ని వక్రీకరించారు. వారి గ్రంథాల్లో మార్పులు చేర్పులు చేశారు. స్వయంగ వారి వ్యక్తిత్వాలను తాము కోరుకున్న ఆటబొమ్మలుగా మార్చుకుని దైవస్వరూపులుగా తీర్చిదిద్దారు.

మొదటి రకం హింస మాత్రం ఆ పవిత్రాత్మల జీవితాల వరకు లేక ఆ తరువాత కొన్ని సంవత్సరాల వరకే పరిమితమైనది. కాని ఈ రెండవ రకం హింస వారి తరువాత శతాబ్దాల తరబడి కొనసాగుతూ వచ్చింది. చాలామంది పుణ్య పురుషుల పట్ల ఈ నాటివరకు అలా కొనసాగుతూనే ఉంది.

ప్రపంచంలో ఈనాటి వరకు జన్మించిన సత్య సందేశకులు అందరూ, మానవుడు ఒకే దైవాన్ని వదలి తన ఆరాధ్యులుగా పూజిస్తూ వచ్చిన అసత్య దైవాల దైవత్వాన్ని అంతమొందించడానికే తమ జీవితమంతా వెచ్చించారు. కాని వారి తరువాత వారి అనుచరులు మూఢ విశ్వాసం కారణంగ స్వయంగ

వారినే దైవంగానో లేక దైవత్వంలో భాగస్వాములుగానో రూపొందించుకున్నారు. దైవ సందేశహరులు జీవితాంతం, తమ సర్వశక్తుల్ని ధారపోసి ఖండించిన దేవతా విగ్రహాలలో వారిని సయితం విగ్రహాలుగా కూర్చోబెట్టారు. వాస్తవానికి మానవునికి తన మీద తనకే అనుమానం, అపనమ్మకం. అతనికి మానవునిలో దివ్య గుణాలు పవిత్ర లక్షణాలు ఉండగలవు, ఉంటాయన్న నమ్మకం కుదరదు. తనను కేవలం బలహీనతలు, పతనాల మిశ్రమమనే భావిస్తాడు. తన ఈ మృణ్మయ శరీరంలో మహోన్నత పరమ ప్రభువు, ఎన్నో శక్తుల్ని దాచి పెట్టాడు. అతడు మనిషి అయినప్పటికీ మానవ లక్షణాలు కలిగివున్నప్పటికీ దివ్య లోకంలో సన్నిహిత దైవదూతలకన్నా ఉన్నత స్థానానికి అవి అతన్ని చేర్చ గలవు. అతని ఆంతర్యం ఈ పరమ సత్య జ్ఞానానికి సాధారణతః బహుదూరం. ఈ కారణంగానే ఈ ప్రపంచంలో ఒక మానవుడు తనను తాను దైవప్రతినిధిగా ప్రకటించుకున్నప్పుడల్లా తోటి మానవులు నమ్మలేదు. తమలా రక్త మాంసాలుగల మానవుడు దైవ సాన్నిధ్యం పొందినవాడు ఎలా కాగలడని స్పష్టంగ తిరస్కరించారు. చివరికి ఆయన వ్యక్తిత్వంలో అసాధారణమైన ఉత్కృష్ట గుణ సంపదను చూసి విశ్వాస భావంతో తలవంచినా, అంతటి అసాధారణమైన సుగుణ సంపత్తి గల వ్యక్తిత్వం ఖచ్చితంగ మానవునిది కాజాలదని తీర్మానించారు. ఒక వర్గం ఆయనను దేవునిగా చేసివేస్తే, మరొకవర్గం అవతార సిద్ధాంతాన్ని సృష్టించి దేవుడే ఆ రూపంలో అవతరించాడని విశ్వసించింది. మరొకవర్గం అతనిలో దేవుని గుణగణాలు, దైవత్వపు అధికారాలు ఉన్నట్లు భావించింది. ఇంకో వర్గం ఆయన దేవుని కుమారుడని అభిప్రాయపడింది. సుబ్‌హానహూ వతాల అమ్మాయసిఫూన్ *(వీరు చేసే కల్పనలన్నింటికీ అతీతుడు, పరిశుద్ధుడు ఆయన).*

ప్రపంచంలోని ఏ ధర్మప్రబోధకుని చరిత్రనయినా అధ్యయనం చేయండి. ఆయన వ్యక్తిత్వం మీద ఆయనను నమ్మినవారే అధికంగ దౌర్జన్యం చేశారని తెలుస్తుంది. ఆ వ్యక్తిత్వం వారి ఊహలు, మూర్ఖభావనల గాఢ చీకటి తెరల క్రింద నలిగిపోయింది. దాని అసలు రూపురేఖలు చెరిగిపోయాయి. అంతేకాదు,

మార్పులు, చేర్పులు చేయబడిన ఆ గ్రంథాల ద్వారా ఆయన ప్రబోధాలు ఏమిటో తెలుసుకోవడం మటుకే కాదు అసలు ఆయన ఎవరో తెలుసుకోవడం కూడా అసంభవం అయిపోయింది. ఆయన జననం పరమాద్భుతం, ఆయన శైశవం కూడా విచిత్రం, కడకు ఆయన మరణం కూడ మహాద్భుతం. అంటే ప్రారంభంనుండి అంతం వరకు చిత్రవిచిత్ర గాథగా కానవస్తుంది. అతను స్వయంగానే దేవుడో, లేక దేవుని కుమారుడో లేక దైవత్వం ఆయనలో లీనమయిపోయినట్లుగానో లేక కనీసం దైవత్వంలో ఆయన కొంతమేరకు భాగస్వామిగానో ఆయన్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది.

ఉదాహరణకు గౌతమ బుద్ధుణ్ణే చూడండి. బౌద్ధధర్మాన్ని నిశితంగ శోధిస్తే వజ్రసంకల్పుడైన ఆ వ్యక్తి బ్రాహ్మణత్వంలోని చాలా దోషాల్ని సంస్కరించాడు. ముఖ్యంగ ఆ కాల ప్రజలు ఆరాధ్యులుగా భావించి పూజించే అసంఖ్యాక శక్తుల్ని, వ్యక్తుల్ని ఆయన ఖండించాడు. కాని ఆయన గతించి వంద సంవత్సరాలు కూడ దాటక పూర్వమే వైశాలి సమావేశంలో (Council) ఆయన అనుచరులు ఆయన ప్రబోధించిన బోధనలనన్నింటినీ మార్చివేశారు. అసలు సూత్రాలకు బదులు క్రొత్త సూత్రాలు రచించారు. మూలాంశాల్లోనూ ఉపాంశాల్లోనూ తమ ఇష్టం, కోరికలు, అభిప్రాయాల కనుగుణంగా తారుమారు చేశారు. ఒకవైపున బౌద్ధధర్మం పేరిట తమ మతంలో దేవుని ఉనికే లేని విశ్వాసాలు నిర్ణయించుకున్నారు. రెండవవైపున బుద్ధుణ్ణి సర్వజ్ఞాని, విశ్వమూలం, ప్రతి యుగంలో లోకాన్ని సంస్కరించడానికి బౌద్ధుని రూపంలో వచ్చే అస్తిత్వంగా రూపొందించారు. ఆయన జననం, జీవితం, గత జన్మలు, భావిజన్మలను గురించి పరమాద్భుతమైన కథలు అల్లారు. వాటిని చదివి ప్రొఫెసర్ విల్సన్ లాంటి పరిశోధకులు పరమాశ్చర్యంతో, "చరిత్రలో నిజానికి అసలు బుద్ధుని ఉనికే లేదు" అని ప్రకటించారు. మూడు, నాలుగు శతాబ్దుల కాలంలోనే ఆ గాథలు బుద్ధునిలో దైవత్వానికి చోటు కల్పించాయి. కనిష్కుని కాలంలో కాశ్మీరులో ఏర్పాటయిన బౌద్ధ మత నాయకుల మహాసభలో బుద్ధుడు వాస్తవంలో దేవుని భౌతిక రూపం

అని తీర్మానించారు. మరోలా చెప్పాలంటే దైవం బుద్ధుని శరీరంలో అంతర్లీనమయి పోయాడన్నమాట.

అలాగే శ్రీరామ చంద్రునిపట్ల కూడ జరిగింది. రామాయణం అధ్యయనం వల్ల, మహారాజ శ్రీరామ చంద్రుడు కేవలం ఒక మానవమాత్రుడే అని స్పష్టంగ తెలుస్తుంది. సద్గుణశీలుడు, న్యాయపాలకుడు, ధైర్యశాలి, దాతృస్వభావి, మర్యాద పురుషుడు, సహనశీలి, త్యాగనిరతుడు లాంటి గుణాల్లో ఆయనకు ఆయనే సాటి అని తప్పక ద్యోతకమవుతుంది. కాని దైవత్వపు నీడకూడ ఆయనలో లేదు. ఒక సాధారణ మానవునిలో అంతటి ఉన్నతమైన లక్షణాలు ఏకత్రమవడం చిక్కుముడిలా తయారయింది. దాన్ని భారతీయ మేధాశక్తి పరిష్కరించలేకపోయింది. అందువల్ల ఆయన గతించిన చాలా కాలానికి విష్ణువే రాముని రూపంలో అవతరించాడని, లోకాన్ని సంస్కరించడానికి విభిన్న కాలాల్లో విష్ణువు ధరించిన అనేక రూపాల్లో ఆయన (రాముడు) కూడా ఒకరని విశ్వసించడం జరిగింది.

ఈ విషయంలో ఈ ఇద్దరికన్నా శ్రీకృష్ణుడు మరీ అన్యాయానికి గురయ్యాడు. ఎన్నెన్నో మార్పులు చేర్పులకు గురై, మరెన్నో ప్రక్షిప్తాల నుండి బయటపడి మన వద్దకు చేరుకున్న భగవద్గీతను నిశితంగ అధ్యయనం చేస్తే శ్రీకృష్ణుడు ఏకేశ్వరవాదియని తెలుస్తుంది. విశ్వప్రభువు సర్వవ్యాపిఅని, సర్వాధికారి అని, పరమ శక్తి సంపన్నుడని సందేశమిచ్చారాయన. కాని మహాభారతం, విష్ణుపురాణం, భాగవతం, స్వయంగ భగవద్గీత ఆయనను విష్ణువు★ కు శారీరక రూపంగా చరాచర సృష్టికర్తగా, విశ్వ నిర్వహణకర్తగా, పరిచయం చేస్తుంది.

రెండవవైపున ఆయన వ్యక్తిత్వానికి ఆపాదించిన బలహీనతల కారణంగ దేవుడు కాదుగదా సచ్ఛీలుడయిన మనిషిగా కూడ ఒప్పుకోవడం కష్టమవుతుంది. గీతలో శ్రీకృష్ణుని ప్రవచనాలు ఇలా కానవస్తాయి.

★ *హిందువుల ప్రస్తుత విశ్వాసాల ప్రకారం విశ్వాన్ని పరిపోషించే దేవత పేరు. బహుశా ఇది దేవుని పోషణా గుణ భావమయి ఉంటుంది. దాన్నే తరువాత ఒక వేరు వ్యక్తిత్వంగా నిర్ణయించి ఉంటారు.*

"ఈ జగత్తునకు నేనే తండ్రిని, తల్లిని, సంరక్షకుడను (లేక, కర్మఫల ప్రదాతను), తాతను; మరియు తెలిసికొనదగిన వస్తువును, పావన పదార్థమును, ఓంకారమును★ ఋగ్వేద, యజుర్వేద, సామవేదములును అయి ఉన్నాను.

"పరమ లక్ష్యమును, భరించువాడును, ప్రభువును, సాక్షియు, ప్రాణుల నివాసమును, శరణమొందదగినవాడును, హితమొనర్చువాడును, సృష్టిస్థితి లయకర్తయు, నిక్షేపమును, నాశరహితమైన బీజమును (మూలకారణమును) నేనే అయియున్నాను.

"ఓ అర్జునా! నేను (సూర్యకిరణముచే) తపింపచేయుచున్నాను. మరియు వర్షమును కురుపించుచున్నాను. వర్షమును నిలుపుదల చేయుచున్నాను. మరణ రాహిత్యమున్ను (మోక్షమున్ను) మరణమున్ను నేనే. అట్లే సద్వస్తువున్ను, అసద్వస్తువున్ను, సత్యమున్నూ, అసత్యమున్నూ నేనే అయియున్నాను."

(గీతామకరందము 9:17,19; రచయిత: శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు; ప్రకాశకులు : శుకబ్రహ్మాశ్రమము, కాళహస్తి)

"నా యొక్క ఉత్పత్తిని (అవతారరహస్యమును లేక ప్రభావమును) దేవగణములు ఎరుగవు. మహర్షులున్నూ ఎరుగరు (ఏలయనిన) నేను ఆ దేవతలకును, మహర్షులకును సర్వవిధముల మొదటివాడను, (కారణభూతు డను) గదా.

"ఎవడు నన్ను పుట్టుకలేనివానిగను, అనాది రూపునిగను, సమస్త లోకములకు నియామకునిగను తెలిసికొనుచున్నాడో, అతడు మనుష్యులలో అజ్ఞానము లేనివాడై సర్వపాపములనుండి లెస్సగ విడువబడుచున్నాడు."

(గీతామకరందము 10 : 2-3)

★ ఏకైక నిర్వహణశక్తి

"ఓ గుడాకేశా! (అర్జునా) సమస్త ప్రాణుల యొక్క హృదయమందున్న ప్రత్యగాత్మను నేను అయి ఉన్నాను. మరియు ప్రాణుల యొక్క ఆది మధ్యాంతములున్ను (సృష్టిస్థితి లయములున్ను) నేనే అయి యున్నాను. నేను ఆదిత్యులలో విష్ణువనువాడను,★ ప్రకాశింపచేయువానిలో కిరణములుగల సూర్యుడను. మరుత్తులను దేవతలలో మారీచుడను★★వాడను, నక్షత్రములలో చంద్రుడను అయి ఉన్నాను." *(గీతామకరందము 10 : 20-21)*

"ఓ అర్జునా! సమస్త ప్రాణికోట్లకు ఏది మూలకారణమై ఉన్నదో అదియు నేనే అయియున్నాను.

"నేనీ జగత్తునంతను ఒక్క అంశము చేతనే వ్యాపించి ఉన్నాను."
(గీతామకరందము 10 : 39-42)

"అర్జునా! ఎవడు నాకొరకే కర్మల జేయునో (లేక నా సంబంధమైన (దైవసంబంధమైన) కార్యములనే చేయునో) నన్నే పరమప్రాప్యముగా నమ్మి యుండునో, నాయందే భక్తి కల్గియుండునో, సమస్త దృశ్య పదార్థములందును సంగమును (ఆసక్తిని, మమతత్వమును) విడిచివేయునో, సమస్త ప్రాణులందును ద్వేషము లేకయుండునో, అట్టివాడు నన్ను పొందుచున్నాడు."
(గీతామకరందము 11 : 55)

"నేను పుట్టుకలేనివాడను, నాశరహిత స్వరూపము కలవాడను. సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయియున్నప్పటికీ స్వకీయమగు ప్రకృతిని వశ పరచుకొని నా మాయాశక్తి చేత పుట్టుచున్నాను. (అవతరించుచున్నాను).

"సాధు, సజ్జనులను సంరక్షించుటకొరకును, దుర్మార్గులను వినాశ

★ *హిందువుల దేవతాగణంలో 12 మంది పెద్ద దేవతలు ఆదిత్యులనబడతారు. వారిలో విష్ణువు గొప్పవాడు. ఈ పన్నెండుమంది దేవతలు అదితి సుతులు.*

★★ *మరత్తులని 41 మంది వాయువుల్ని నియంత్రించే దేవతలు. వారి నాయకుడే మారీచుడు.*

మొనర్చుట కొరకును, ధర్మమును లెస్సగ స్థాపించుట కొరకును నేను ప్రతి యుగము నందును అవతరించుచుందును."

(గీతామకరందము 4 : 6 - 8)

ఈ ప్రవచనాల్లో గీతా కృష్ణుడు నేనే దేవుణ్ణి అని ప్రకటించుకున్నాడు.★ కాని ఇంకో వైపు భాగవతం ఆ కృష్ణుణ్ణి మరోవిధంగా పరిచయం చేస్తుంది. జలకమాడుతున్న గోపికల బట్టలను దాచివేసి, వారితో వినోదించడానికి గోపికలకు సరిపడే అన్ని శరీరాలను సృష్టించుకుంటాడు. సరిగ్గ ఇక్కడే శుక మహర్షిని పరీక్షిత్తుడు, "సత్యధర్మాన్ని ప్రబోధించడానికి దేవుడు అవతారరూపంలో ప్రత్యక్ష మవుతాడు కదా. అలాంటప్పుడు సర్వధర్మసూత్రాలకు విరుద్ధంగా పరస్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకున్నవాడు దేవుడు ఎలా అవుతాడు" అని అడుగుతాడు. ఆ ఆక్షేపణను తొలగించడానికి మహర్షి సాకులు వెదకవలసి వస్తుంది.

"స్వయంగ దేవతలు కూడ కొన్ని సమయాలలో నీతిమార్గం నుండి తప్పుకుంటారు. కాని అగ్ని అన్ని వస్తువుల్ని దహించివేసినప్పటికీ నేరం దాని మీద మోపడం జరగనట్లే దేవతల పాపాలు వారి వ్యక్తిత్వం మీద ప్రభావం వేయవు" అని సమాధానం ఇచ్చాడు మరోమార్గం లేక.

ఇంగితజ్ఞానమున్న వారెవరయినా, ఉన్నత శ్రేణి ధర్మబోధకుని జీవితం ఇంతగా అపవిత్రమై ఉంటుందని అనుకోలేడు; నిజమయిన ధార్మిక నాయకుడు

★ *ఒకవేళ గీత స్వయంగా దైవవాణి అని, దైవగ్రంథమని దాన్ని అందజేసే ప్రవక్త శ్రీకృష్ణుడుగా ప్రకటించి ఉంటే ఈ మాటల్లో చాలా వరకు దైవవచనాలని నిర్ణయించవచ్చు. కృష్ణుడు దేవునిగా ప్రకటించుకున్నట్లు ఉండేదికాదు. కాని చిక్కు ఏమిటంటే, ఈ గ్రంథం స్వయంగా కృష్ణుని ఉపదేశంగా ముందుకు వస్తుంది. గీత అంతటా ఎక్కడా ఒక్క సంజ్ఞమాత్రంగా కూడా అది దైవవచనమన్నట్లు లేదు.*

వాస్తవానికి తాను మానవులకూ, అనంత విశ్వానికీ ప్రభువనీ దైవమనీ ప్రకటించుకోవడం కూడా ఊహకు అందని విషయం. ఖుర్‌ఆన్, బైబిల్‌లను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే వాస్తవం ఏమిటో స్పష్టంగ కానవస్తుంది. జాతులు తమ బుద్ధి క్షీణత, నైతిక పతనావస్థల కాలంలో తమ బలహీనతలకు నిదర్శనాలు చూపెట్టుకోడానికి పవిత్రమానవుల జీవిత చరిత్రలను నీచాతినీచంగ చిత్రించడం మాత్రమే కాక వారి వ్యక్తిత్వాల చుట్టూ అభూత కల్పనలు, గాధలు అల్లివేశారు. అందువల్ల శ్రీకృష్ణుని విషయంలో కూడ అలానే జరిగి ఉంటుందని, ఆయన వాస్తవ బోధనలు, అసలు వ్యక్తిత్వం హిందూ మతగ్రంథాలు ప్రవేశపెడుతున్న దానికి భిన్నంగా ఉందేమోనని మేము భావిస్తున్నాము.

దైవప్రవక్తలని స్పష్టమైన ఆధారాలు, విశ్వసింపదగిన నిదర్శనాలున్న వారిలో ఏసుక్రీస్తు ఒకడు. ఆయనకు ఎనలేని అన్యాయం జరిగింది. అందరు మానవుల్లానే ఈసా (అ) కూడ ఒక మానవుడు. మానవునిలో ఉండే సకల లక్షణాలు, ప్రత్యేకతలు ఆయనలో ఉండేవి. భేదం కేవలం ఒక్కటే. విశ్వప్రభువు ఆయనకు విచక్షణా జ్ఞానం, ప్రవక్త పదవీ, మహిమాన్విత శక్తులు ప్రసాదించి ఒక భ్రష్టజాతిని సంస్కరించేందుకు నియమించాడు. కాని ప్రధమంగ ఆయన జాతి ఆయనను తిరస్కరించింది. మూడు సంవత్సరాలు కూడా ఆయన పవిత్ర వ్యక్తిత్వాన్ని భరించలేకపోయింది. తరువాత నిండు యౌవ్వనంలో అడుగిడిన ఆయనను హత్య చేయాలని నిశ్చయించుకుంది. ఆ తరువాత విధిలేక ఆయన ఔన్నత్యాన్ని అంగీకరిస్తే అన్ని హద్దుల్ని దాటేసి ఆయనను దేవుని కుమారుడు, కాదు, దేవునిగానే మార్చివేసింది. మానవుడు స్వాభావికంగ పాపాత్ముడనీ, అతను స్వయంగ తన ఆచరణ ద్వారా విముక్తి పొందలేడనీ అందువల్ల దేవుడు యేసు రూపంలో శిలువకు బలైపోయి మానవుల పాప పరిహారం చెల్లించడానికి అవతరించాడనీ ఆయన బోధించినట్లు ఈ విశ్వాసాన్ని ఆయనకు ఆపాదించింది. దైవం మన్నించుగాక, ఒక సత్యప్రవక్త తన ప్రభువు మీద అంతపెద్ద నిందారోపణ ఎలా మోపగలడు? కాని ఆయనను నమ్మినవారు విశ్వాసోద్రేకంతో ఆయన

మీద ఈ ఆరోపణ మోపినారు. ఆయన బోధనలు తమ మనోకాంక్షల ప్రకారం ఎంతగా మార్చివేశారంటే ప్రపంచంలో ఏ గ్రంథంలోనూ (ఖుర్ఆన్ తప్ప) ఏసు క్రీస్తు బోధించిన అసలు ఉపదేశాలు, స్వయంగ ఆయన అస్తిత్వానికి సంబంధించిన ఒక గుర్తు కూడ కానరాదు. బైబిల్ క్రొత్త నిబంధనలో నాలుగు సువార్తల పేరుతో అలరారే గ్రంథాలను చూడండి. అన్నీ దేవుని సంవిలీనం, దేవుని కౌమార్యం, స్వయంగా ఆయనే దైవంలాంటి దుష్టభావనలతో కలుషితమయి ఉన్నాయి. ఒకచోట మరియం (అలై.స.)కు "నీ శిశువు దేవుని కుమారుడనబడును." *(లూకా 1:35)* అన్న శుభవార్త తెలుపబడుతుంది. ఇంకోచోట "దేవుని ఆత్మ పావురము వలె దిగి తన మీదకు వచ్చి ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు అని అనును." *(మత్తయి - 16 : 17)*

మరోచోట స్వయంగ యేసు "నేను దేవుని కుమారుణ్ణి. శక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుని ఉండడం మీరు నన్ను చూచెదరు." *(మార్క్ 14:62)*

"తీర్పు దినాన దైవానికి బదులు క్రీస్తును మహిమాన్విత ఆసనాన కూర్చుండబెట్టడం జరుగుతుంది. ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన ఎదుట పోగు చేయబడుదురు. వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవనమునకు పోవుదురు." *(మత్తయి 25 : 31 - 46)*

ఇంకోచోట యేసుచేత స్వయంగా ఇలా పలికించడం జరుగుతుంది.

"తండ్రి నాయందును, నేను తండ్రియందును ఉన్నాను."

(యోహాను 10 - 38)

ఆ సత్యసంధునినోట తప్పుడు మాటలు వెలువరించబడతాయి.

"నేను దేవుని యొద్ద నుండి బయలుదేరి వచ్చి ఉన్నాను. నా అంతట నేను వచ్చి ఉండలేదు. ఆయన నన్ను పంపెను." (యోహాను 8 : 42)

అయనన్నీ దైవాన్నీ ఒకటిగానే చెయ్యడం కూడా జరుగుతుంది. ఆయన నోట ఈ మాట ఆపాదించబడుతుంది :

"నన్ను చూచినవాడు తండ్రిని చూచి ఉన్నాడు. తండ్రి నా యందు నివసించుచు తన క్రియలు చేయుచున్నాడు." *(యోహాను 14 - 109)*

మరోచోట "దేవునికి చెందిన సమస్తమూ క్రీస్తుకు అప్పగించ బడ్డాయి." *(యోహాను 3 : 35)*

"దైవం తన కార్యకలాపాలన్నీ క్రీస్తుకు అప్పజెబుతాడు."
(యోహాను 5 : 20 - 22)

విభిన్న జాతులు తమ మతాచార్యులు, నాయకుల మీద అపవాదులు, ఆరోపణల దట్టమైన తెరలు పరచడానికి అసలు కారణం మేము మొదట ప్రస్తావించిన అతిశయ భావాలు. ఆ చెడుకు అమితంగ సహకరించిన విషయం, ఆ పుణ్యపురుషులు గతించిన తర్వాత వారి హితవులు, శిక్షణలు చాలా వరకు అసలు లిఖించబడనే లేదు. అందువల్ల కొంతకాలం గడిచిన తర్వాత వాస్తవం, అవాస్తవం ఏమిటో గ్రహించలేనంతగా వాటిలో మార్పులు, చేర్పులు చేయ బడ్డాయి. ఆ విధంగ విశుద్ధమైన హితవు ఏదీ లేని ఫలితంగ కాలం గడిచిపోయిన కొలది యదార్థాన్ని మౌఢ్యం ఆక్రమించుకుంది. అలా కొన్ని శతాబ్దాల్లో వాస్తవ మంతా అదృశ్యమయిపోయింది. అభూత కల్పనలు, కథలు, గాథలు మాత్రమే మిగిలిపోయాయి.

ప్రపంచంలో మత నాయకులందరిలో కేవలం హజ్రత్ ముహమ్మద్ (స) అందజేసిన బోధనలు, ఆయన వ్యక్తిత్వం 15 శతాబ్దాలు గడిచినా పొల్లు పోకుండా నిజరూపంలో సురక్షితంగా ఉంది. అదే ఆయన ప్రత్యేకత. దేవుని కరుణాకటాక్షం వల్ల కట్టుదిట్టమైన ఏర్పాటు కారణంగ దాన్ని ఇప్పుడు మార్చ గలగడం అసాధ్యం. మహోన్నత శిఖరానికి చేరుకున్న ఆ పవిత్ర వ్యక్తిత్వాన్ని

కూడ మానవులు తమ అజ్ఞానం, అభూత కల్పనలతో మహాద్భుతంగా రూపుదిద్ది దానికి దైవత్వ లక్షణాలు ఆపాదించి, ఆయన విధేయతకు బదులు కేవలం పూజ పురస్కారాల వరకే పరిమితం చేసి ఉండేవారు. కాని విశ్వప్రభువు సంకల్పం వేరు. ప్రవక్తల ఆఖరు ఘట్టంలో మానవునికి శాశ్వతమైన ఆదర్శనీయ జీవితాన్ని, విశ్వజనీన ధర్మాన్ని స్థాపించే నాయకుణ్ణి ప్రభవింపచేయడమే ఆయన సంకల్పం. అందువల్ల ఆయన ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (స) వ్యక్తిత్వాన్ని రక్షించాడు. అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడే విశ్వాసుల ద్వారా ప్రవక్తలు, విభిన్న బోధకుల పట్ల జరుగుతూ వచ్చిన దారుణ అన్యాయం జరగకుండా రక్షించాడు. పూర్వపు జాతులలో సంభవించిన దానికి భిన్నంగా ప్రవక్త సహచరులు, వారి అనుచరులు, తర్వాత హదీసువేత్తలు, తమ ప్రవక్త పవిత్ర జీవిత చరిత్రను అసాధారణమైన రీతిలో భద్రపరిచే యత్నాలు చేశారు. ఆ కారణంగ 15 వందల సంవత్సరాలు గతించిన తరువాత కూడ ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన కాలపు ప్రజలు ఎంత సమీపంగ దర్శించగలిగారో, మనం కూడ దాదాపు అంతే సమీపంగ దర్శించగలుగుతున్నాము. ఒకవేళ ఇస్లామీయ పండితుల వర్గం సంవత్సరాల తరబడి శ్రమించి సేకరించిన పుస్తక భాండాగారం ప్రపంచంనుండి సమసిపోయినా, హదీసులు, పవిత్ర జీవిత చరిత్రలోని ఒక్క పేజీ కూడ ప్రపంచంలో మిగలకపోయినా కేవలం దైవగ్రంథం (ఖుర్ఆన్) మాత్రమే మిగిలి ఉన్నా చాలు, దాన్ని అందజేసిన మహనీయుని గురించి ఒక జిజ్ఞాసువు హృదయంలో జనించే మౌలిక ప్రశ్నలన్నింటికీ ఆ గ్రంథం ద్వారా సమాధానాలు సాధించవీలవుతుంది. ఖుర్ఆన్, దాన్ని అందజేసే వ్యక్తిని ఏ రూపంలో పరిచయం చేస్తుందో పరిశీలిద్దాం, రండి.

1. దివ్య ఖుర్ఆన్ ప్రవక్తను గురించి అత్యంత విపులంగ ప్రకటించిన విషయం ప్రవక్త మానవుడు కావడం. ఖుర్ఆన్ అవతరణకు పూర్వం శతాబ్దాల తరబడి ఏర్పడిన విశ్వాసాలు నిర్దిష్టంగ తేల్చిన విషయం, మానవుడు ఎప్పటికీ దేవుని ప్రవక్తకాని, ప్రతినిధికాని కాజాలడన్నది. ఫలితంగా అవసరమున్నప్పుడు

ప్రపంచాన్ని సంస్కరించడానికి దేవుడే స్వయంగ మానవ రూపంలో ప్రత్యక్షమవు తాడు లేక ఒక దైవదూతనో, దేవతనో పంపిస్తాడని, ప్రపంచాన్ని సంస్కరించడానికి వచ్చిన మహాపురుషులందరూ అతీంద్రియ శక్తులు గలవారన్న విశ్వాసం వ్రేళ్ళూనింది. ఒక సజ్జనుడెప్పుడైనా దేవుని సందేశాన్ని ప్రబోధించడానికి రాగానే ప్రజలు ఆశ్చర్యచకితులై ఈయన ప్రవక్త ఎలా అవుతాడు? మనలాగే తింటూ, నిద్రపోతూ తిరుగుతాడు. ఈయన ఎలా సందేశహరుడవుతాడు? మనకున్న అన్ని అవసరాలు, సంబంధాలు ఆయనకు కూడ ఉన్నాయి కదా. జబ్బు పడ తాడు, సుఖ దుఃఖాలకు లోనవుతాడు. బాధకు, ఆనందానికి ప్రభావితుడవుతాడు. ఒకవేళ దేవుడు మాకు మార్గదర్శకత్వం చూపదలిస్తే మాలాంటి ఒక బలహీన మానవుణ్ణి ఎందుకు పంపిస్తాడు, దేవుడే స్వయంగ రాలేడా? ఇలాంటి ప్రశ్నలు ప్రతి ప్రవక్త జననంపై ఉదయిస్తూ వచ్చాయి. వాటి ఆధారంగానే ప్రజలు ప్రవక్తల్ని తిరస్కరిస్తూ వచ్చారు. హజ్రత్ నూహ్ (అలై) తన జాతికి సందేశాన్ని అందజేయడానికి రాగా,

"ఈ వ్యక్తి మీవంటి ఒక మానవుడే తప్ప మరేమీకాడు. మీపై ఆధిక్యత సాధించడం ఇతని అభిమతం. అల్లాహ్ గనుక పంపదలిస్తే దైవదూతలను పంపి ఉండేవాడు." *(ఖుర్ఆన్ 23 : 24)*

హూద్ (అలై)ను తన జాతికి హితవు గరపడానికి పంపించినప్పుడు ఆయన మీద కూడ మొట్టమొదట ఈ ఆరోపణే చేశారు.

"ఈ వ్యక్తి ఏమీకాడు, మీవంటి ఒక మానవుడు తప్ప. మీరు తినే దాన్నే ఇతడూ తింటాడు, మీరు త్రాగే దాన్నే ఇతడూ త్రాగుతాడు. ఇప్పుడు మీరు గనుక మీ వంటి వాడే అయిన ఒక మానవుడికి విధేయతను చూపినట్లయితే, మీరు నష్టానికే గురి అవుతారు." *(ఖుర్ఆన్ 23 : 32)*

హజ్రత్ మూసా (అలై), హజ్రత్ హారూన్ (అలై)లు సత్యసందేశం అందజెయ్యడానికి ఫిర్ఔన్ వద్దకు చేరుకోగానే ఈ కారణంగానే వారి మాటలు తిరస్కరించబడ్డాయి:

'మేము మా వంటివారే అయిన ఇద్దరు మనుషులను విశ్వసించాలా?'
(ఖుర్‌ఆన్ 23 : 47)

అలానే మక్కాలో నిరక్షరాస్యుడైన ఒక మానవుడు 40 సంవత్సరాల వరకు మౌనంగ జీవితం గడిపి "నేను దేవుని చేత ప్రవక్తగా నియమించడ్డా"నని అకస్మాత్తుగ ప్రకటించిన సమయాన ఖచ్చితంగ అదే ప్రశ్న తలెత్తింది. ఒక వ్యక్తి మాలాగ చేతులు, కాళ్ళు, కళ్ళు, ముక్కు, శరీరం, ప్రాణం కల్గి ఉండే ఒక మానవుడు దేవుని ప్రవక్త కాగలడన్న విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. వారు విచిత్రంగా అడిగేవారు:

"ఇతనేమి ప్రవక్త, అన్నం తింటాడు, బజారులలో తిరుగుతూ ఉంటాడు? ఇతని వద్దకు ఒక దైవదూత అయినా ఎందుకు పంపబడలేదు, ఇతనితో ఉంటూ (విశ్వసించని వారిని) బెదిరించటానికి? లేదా ఏది లేకపోయినా కనీసం ఇతని కొరకు ఒక నిధి అయినా ఎందుకు దించబడలేదు? లేదా ఇతనికి ఒక తోట అయినా ఎందుకు లేదు, దాని ద్వారా ఇతను (నిశ్చింతగా) ఉపాధిని పొందటానికి?" *(ఖుర్‌ఆన్ : 25 : 7, 8)*

ఈ అపార్థం దైవదౌత్యాన్ని అంగీకరించడానికి పెద్ద అవరోధంగా పరిణమించినందువల్ల దివ్యఖుర్‌ఆన్ దాన్ని గట్టిగా ఖండించింది. మానవుని మార్గదర్శకత్వానికి మానవుడే తగినవాడని నిదర్శనాలతో వివరించింది. ప్రవక్త ఆవిర్భావం కేవలం మార్గనిర్దేశన వరకే పరిమితం కాదని స్వయంగ ఆచరించి చూపించవలసి ఉందని, మానవులు ఆచరించడానికి, అనుసరించడానికి ఒక ఆదర్శాన్ని కూడ నిలుపవలసి ఉందని తెలుపడం జరిగింది. ఈ ఆశయం కోసం మానవలక్షణాలు, బలహీనతలు లేని ఒక దైవదూతను, లేక ఒక మానవాతీత వ్యక్తిత్వాన్ని పంపించి ఉంటే, "మేము ఎలా ఆచరించగలం. అతడు మాలా మనస్సు, మనోకాంక్షలు కలిగి లేని వ్యక్తికదా, అతని నైజంలో, మానవుణ్ణి పాపమార్గానికి మళ్ళించే శక్తులే లేవు కదా" అని మనిషి అభ్యంతరం తెలిపేవాడు.

“భువిలో దైవదూతలు నిశ్చింతగా తిరుగుతూ ఉండివుంటే, మేము తప్పకుండా ఆకాశం నుండి దైవ దూతనే వారి కోసం ప్రవక్తగా పంపి ఉండేవారము.” *(ఖుర్‌ఆన్ 17 : 95)*

అంతకు పూర్వం పంపిన ప్రవక్తలు, సత్యసంధులైన బోధకులందరూ దైవప్రవక్త ముహమ్మద్ (స) లాంటి వారే. ప్రతి మానవుడు తినే, త్రాగే, సంచరించేలా వారు కూడ తిని, త్రాగి, సంచరించే వారేనని స్పష్టంగ వివరించబడింది.

“నీకు పూర్వం కూడ మేము మానవులనే ప్రవక్తలుగా పంపాము. వారికి మేము వహీని అందజేశాము. ఒకవేళ మీకు ఇది తెలియకపోతే, గ్రంథ ప్రజలను అడగండి. ఆ ప్రవక్తలకు మేము అన్నం తినే అవసరంలేని శరీరాలనూ ఇవ్వలేదు, వారు చిరంజీవులు కూడ కాదు.” *(ఖుర్‌ఆన్ 21 : 8)*

“ప్రవక్తా! నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరూ అన్నం తినేవారే, బజారులలో సంచరించేవారే.” *(ఖుర్‌ఆన్ 25 : 20)*

“నీకు పూర్వంకూడా మేము చాలామంది ప్రవక్తలను పంపాము. మేము వారిని ఆలుబిడ్డలు కలవారుగానే చేశాము.” *(ఖుర్‌ఆన్ 13 : 38)*

ఆ తర్వాత దైవప్రవక్త ముహమ్మద్ (స)ను, ‘నీవు మానవుడవని స్పష్టంగ ప్రకటించు’ అని ఆదేశించడం జరిగింది. ఆయనకు పూర్వం ప్రవక్తలకు దైవత్వం ఆపాదించబడినట్లే ఆయన తర్వాత ప్రజలు ఆయనకు కూడ దైవత్వం ఆపాదించకుండా జాగ్రత్తపడటం జరిగింది. అందుకు దివ్య ఖుర్‌ఆన్‌లో పలుచోట్ల ఈ ఆయత్ వచ్చింది.

ప్రవక్తా! ఇలా చెప్పు, “నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటివాణ్ణి, నాకు వహీద్వారా ఇలా తెలుపబడింది- మీ దైవం కేవలం ఒకే దైవం.”

(ఖుర్‌ఆన్ 18 : 110)

ఈ వివరణలవల్ల కేవలం ముహమ్మద్ (స)ను గురించి చెడునమ్మకాల ద్వారాలు మూసుకుపోవడమే కాక ఆయనకు పూర్వపు ప్రవక్తలైన మహనీయుల పట్ల గల అపార్థాలు, అపోహలు కూడా దూరమయ్యాయి.

2. దివ్య ఖుర్‌ఆన్‌లో ఎంతో వివరంగా తెలిపిన రెండవ విషయం, ప్రవక్తకు గల శక్తి, సామర్థ్యాల వివరణ. అజ్ఞానం, అవివేకంలో దైవజ్ఞానాన్ని దైవత్వానికి సమానార్థకంగా చేశాయి. దానితోపాటు సహజంగానే దైవజ్ఞులైన వారిలో అసాధారణమైన శక్తులు ఉంటాయన్న విశ్వాసం కూడ జనించింది. దేవుని దర్బారులో వారికి ప్రత్యేకమైన అధికారాలు ఉంటాయని, సత్ఫలితం ఇవ్వడంలోనూ శిక్ష ఇవ్వడంలోనూ వారికి ప్రవేశముంటుందని, గోచర, అగోచరాలు వారికి ప్రత్యక్షమవుతాయని, అదృష్టాల తీర్పులు వారి సలహా సంప్రదింపుల ద్వారా మారుతుంటాయని, లాభ నష్టాల మీద వారికి అధికార ముంటుందని, మంచి చెడులకు వారు స్వాములని, విశ్వంలోని సర్వశక్తులు వారి ఆధీనంలో ఉంటాయని, ఒక్క చూపుతో వారు ప్రజల హృదయాలను పరివర్తింపచేసి వారిలోని అంధకారాన్ని మార్గభ్రష్టతను దూరంచేయగలరని కూడా ప్రజలు నమ్ముతారు. ఇలాంటి అభిప్రాయాలు, ఆలోచనల కారణంగానే దైవప్రవక్త (స)ను కూడ వింత వింత విషయాలు కోరేవారు ప్రజలు. ఖుర్‌ఆన్‌లో ఉంది:

వారు ఇలా అన్నారు: "మేము నీ మాటను నమ్మము. నీవు భూమిని చీల్చి మా కోసం ఒక చెలమను పొంగింపచెయ్యాలి. ఖర్జూరపు చెట్లూ ద్రాక్షాలతలు కల తోట ఒకటి నీ కోసం ఉద్భవించాలి. అందులో నీవు కాలువలను ప్రవహింప జెయ్యాలి. నీవు ప్రకటిస్తున్న విధంగా ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగాచేసి మాపై పడవెయ్యాలి. దేవుణ్ణీ, దైవదూతలనూ మా ఎదుటకు తీసుకురావాలి. నీ కోసం ఒక స్వర్ణగృహం తయారు కావాలి. నీవు ఆకాశాన్ని అధిరోహించాలి. అంతవరకు నీ మాటను మేము నమ్మము. అంతేకాదు, మేము చదవటానికి నీవు మాపై ఒక రచన అవతరించేటట్లు చేయనంతవరకు మేము నీ అధిరో

హించటాన్ని కూడా నమ్మము. ప్రవక్తా! వారితో ఇలా అను: "నా ప్రభువు పరిశుద్ధుడు! నేను సందేశాన్ని తెచ్చే ఒక మానవమాత్రుణ్ణి తప్ప మరింకేమైనా అవుతానా?" *(దివ్య ఖుర్‌ఆన్ 17 : 90 - 93)*

దైవభక్తి, మహనీయతలను గురించి ప్రజల్లో ప్రబలి ఉన్న అపార్థాలను, తప్పుడు భావనలను అన్నింటినీ విశ్వప్రభువు ఖండించి, ప్రవక్తకు దైవశక్తులు, దైవ కార్యాల్లో ఏమాత్రం జోక్యం చేసుకునే అధికారంగాని, ఆ పనుల్లో భాగం గాని లేదని స్పష్టంగ తెలియపరిచాడు. ప్రవక్త మా సంకల్పం లేకుండ ఇతరులను, బాధలనుండి కాపాడ్డం అటుంచి స్వయంగ తనను తాను కూడా బాధలనుండి కాపాడుకునే శక్తి కలిగి లేడు అని దేవుడు స్పష్టీకరించాడు.

"అల్లాహ్ గనక మీకు ఏదైనా నష్టం కలిగిస్తే, ఆయన తప్ప ఆ నష్టాన్నుండి మిమ్మల్ని రక్షించగలిగే వారెవరూ లేరు. ఆయన మీకు ఏదైనా మేలు కలుగజేస్తే, ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉంది." *(ఖుర్‌ఆన్ 6 : 18)*

ఇలా అను : "నా అధీనంలో స్వయంగా నా లాభనష్టాలు సైతమూ లేవు. అంతా అల్లాహ్ సంకల్పం మీద ఆధారపడి ఉంది." *(ఖుర్‌ఆన్ 10 : 49)*

ప్రవక్తా! వారితో ఇలా అను : "నా వద్ద అల్లాహ్ నిధి నిక్షేపాలు ఉన్నాయనిగానీ, నాకు అగోచర జ్ఞానం కలదనిగానీ నేను మీతో చెప్పటం లేదు. ఇంకా నేను దైవదూతనని కూడా అనటం లేదు. నేను కేవలం నాపై అవతరింపచేయబడే 'వహీ'ని మాత్రమే అనుసరిస్తాను." *(ఖుర్‌ఆన్ 6 : 50)*

ప్రవక్తా! వారితో ఇలా అను :"నాకు సంబంధించిన లాభనష్టాలపై నాకు ఏ అధికారమూ లేదు. అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనక అగోచర విషయజ్ఞానం ఉన్నట్లయితే, నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మేవారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే, శుభవార్త వినిపించేవాణ్ణి మాత్రమే." *(ఖుర్‌ఆన్ 7 : 188)*

అంతేకాదు, ప్రళయం నాడు లెక్కలు చూడటంలోనూ, శిక్ష బహుమానాలు ప్రసాదించడంలోనూ దైవప్రవక్త ప్రమేయం ఏదీ లేదు. ఆయన కార్యం కేవలం సందేశాన్ని అందజేసి, రుజుమార్గాన్ని బోధించడమే. జనుల లెక్కలు చూడటం, పట్టుకోవడం, శిక్ష విధించడం, బహుమానాలు ఇవ్వడం దేవుని పని అని తెలుపడం జరిగింది.

ఇలా అను : "నేను మీ కోరికలను అనుసరించను. అలా చేసినట్లయితే, నేను మార్గభ్రష్టుడనయిపోతాను. సన్మార్గం పొందిన వారిలో ఉండను." అను: "నా ప్రభువు వద్దనుండి వచ్చిన ఒక సుస్పష్టమైన ప్రమాణం విషయంలో నేను స్థిరంగా ఉన్నాను. మీరు దానిని అసత్యమని తిరస్కరించారు. ఇప్పుడు మీరు తొందరపెడుతున్న విషయం మాత్రం నా అధీనంలో లేదు. నిర్ణయాధికారం పూర్తిగా అల్లాహ్‌కే ఉంది. ఆయనే సత్య విషయాన్ని ప్రకటిస్తాడు. ఆయనే ఉత్తమ నిర్ణయం చేసేవాడు." ఇలా అను : "మీరు తొందరపెట్టే విషయం నా అధీనంలోనే గనక ఉన్నట్లయితే, నాకూ మీకూ మధ్య ఎప్పుడో తీర్పు జరిగిపోయి ఉండేది. కాని దుర్మార్గులపట్ల ఎలా వ్యవహరించాలో అల్లాహ్‌కు బాగా తెలుసు." *(ఖుర్‌ఆన్ 6 : 57, 58)*

"ప్రవక్తా! నీ పని కేవలం సందేశాన్ని అందజెయ్యటమే. లెక్క తీసుకోవటం మటుకు మా పని." *(ఖుర్‌ఆన్ 13 : 40)*

"(ఓ ప్రవక్తా!) మేము మానవులందరి కోసం ఈ సత్యగ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. ఇక ఎవడు రుజుమార్గాన్ని అవలంబిస్తాడో, అతడు తన మేలు కోసమే అలా చేస్తాడు. ఎవడు మార్గం తప్పుతాడో, ఆ మార్గం తప్పటమనే కీడుకు అతడే బాధ్యుడు అవుతాడు. నీవు వారికి బాధ్యుడవు కావు."

(ఖుర్‌ఆన్ 39 : 41)

ఇంకా ప్రజల హృదయాలను పరివర్తింపచేయడం, సత్యాన్ని అంగీకరించేందుకు సంసిద్ధంగ లేని వారిలో విశ్వాసాన్ని జనింపచేయడం ప్రవక్తకు

అసాధ్యమైనపని. ఆయన మార్గదర్శకుడు అన్నదానికి భావం హితబోధ, దైవజ్ఞాపనపట్ల తనకు గల బాధ్యతను ఆయన పరిపూర్ణంగ నిర్వర్తిస్తాడు. మార్గాన్ని చూడగల అభిలాష కలవారికి మార్గాన్ని చూపెడతాడు.

"నీవు మృతులకు వినిపించలేవు. వీపు త్రిప్పి పరుగెత్తే బధిరులకు కూడ నీ పిలుపును వినిపించలేవు. అంధులకు మార్గం చూపి, వారు తప్పిపోకుండా కాపాడనూలేవు. మా వాక్యాలను విశ్వసించి, విధేయులయ్యే వారికి మాత్రమే నీవు నీ మాటను వినిపించగలవు." *(ఖుర్‌ఆన్ 27 : 80, 81)*

"(ప్రవక్తా) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు. నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే. మేము నిన్ను సత్యంతో పంపాము- శుభవార్త ఇచ్చేవానిగా, భయపెట్టేవానిగా జేసి." *(ఖుర్‌ఆన్ 35 : 24)*

ప్రవక్తకు శక్తి, సామర్థ్యం, ఉన్నత స్థితి ప్రాప్తమవడానికి గల కారణం ఆయన దేవుని విధేయుడయి ఉండడమే. ఆయన దేవుని ఆజ్ఞలను పాటిస్తాడు. ఆయనకు అవతరింపచేసిన వాణిని ఉన్నది ఉన్నట్లుగా దేవుని దాసుల వద్దకు చేరవేస్తాడు. అలా కాకుండ ఆయన అవిధేయుడై, దైవవాణిలో తనకు తోచిన మాటల్ని చేర్చి మిళితం చేస్తే మాత్రం ఆయనకు ఎలాంటి ప్రత్యేక స్థానం మిగులదన్న విషయం కూడ స్పష్టంగ తెలియచేయబడింది.

"నీవు ఈ జ్ఞానం పొందిన తరువాత కూడ, ఒకవేళ నీవు వారి కోరికలను అనుసరిస్తే, నిశ్చయంగా దుర్మార్గులలో చేరిపోతావు." (ఖుర్‌ఆన్ 2 : 145)

"దివ్యజ్ఞానం నీ వద్దకు వచ్చిన పిదపకూడ, ఒకవేళ నీవు వారి కోరికలకు లొంగిపోతే, నిన్ను అల్లాహ్ పట్టునుండి రక్షించే మిత్రుడూ, సహాయుడూ ఎవడూ లేడు." *(ఖుర్‌ఆన్ 2 : 120)*

ప్రవక్తా! వారితో ఇలా అను: "ఇందులో నా అంతట నేను మార్పులూ చేర్పులూ చెయ్యటం నాపని ఎంతమాత్రం కాదు. నేను నా వద్దకు పంపబడే

వహీని మాత్రమే అనుసరిస్తాను. నేను గనుక నా ప్రభువుపట్ల అవిధేయత చూపితే, ఒక పెద్ద భయంకరమైన దినంనాడు పడే శిక్షకు నేను భయపడు తాను." *(ఖుర్‌ఆన్ 10 : 15)*

(దైవం మన్నించుగాక) దైవప్రవక్త (స) అవిధేయతనో లేక మార్పులు చేర్పులు చేస్తారనో ఏమాత్రమైనా అనుమానం ఉండటం వల్ల ఆ మాటలు పలుకలేదు. అసలు ఉద్దేశ్యం, సర్వోన్నతుడైన విశ్వప్రభువు వద్ద ఆయనకున్న సన్నిహితత్వానికి గల కారణం ప్రవక్తకు వ్యక్తిగతంగా అల్లాహ్‌తో ఏదో బంధుత్వం ఉండటం కాదు, సన్నిహితత్వానికి అసలు కారణం ఆయన దేవుని అత్యున్నత స్థాయి విధేయుడు, మనోవాత్మలతో ఆయనకు దాసుడు కావడమని లోకానికి విస్పష్టం చేయడం.

3. మూడవ విషయం, దివ్యఖుర్‌ఆన్‌లో పలుమార్లు అత్యంత వివరంగా ప్రస్తావించిన విషయం, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఓ క్రొత్త ప్రవక్త కాదన్నది. ఆదినుండి మహనీయ ముహమ్మద్ ప్రభవన వరకు కొనసాగుతూ వస్తున్న ప్రవక్తల వర్గంలో ఆయన ఒకరని; ఆ పరంపరలో ప్రతి జాతి, ప్రతి యుగంలోని ప్రవక్తలు, దైవ సందేశహరులు చేరి ఉన్నారని స్పష్టంగ తెలియ పరచబడింది. ప్రవక్త పదవిని, దైవదౌత్యాన్ని ఒక వ్యక్తి, ఒక దేశం లేక ఒక జాతికి ప్రత్యేకించదు దివ్య ఖుర్‌ఆన్. విశ్వప్రభువు ప్రతి జాతి, ప్రతి దేశం, ప్రతి యుగంలో పవిత్రాత్మల్ని ప్రభవింపచేశాడని, వారు మానవాళికి రుజుమార్గ సందేశం అందజేశారని, భ్రష్టమార్గంలో ఎదురయ్యే దుష్ఫలితాలను గురించి హెచ్చరించారని వివరించింది.

"హెచ్చరికచేసే వాడెవ్వడూ రాని జాతి ఏదీ లేదు." *(ఖుర్‌ఆన్ 35 : 24)*

మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: "అల్లాహ్‌ను ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి." *(ఖుర్‌ఆన్ 16 : 36)*

ఆ ప్రవక్తలు హెచ్చరిక చేసిన వారిలో ఒకరు ముహమ్మద్ (సఅసం) కూడ ఉన్నారు. అందుకే పలుచోట్ల ఇలా వివరించబడింది.

"ఇదివరకు వచ్చిన హెచ్చరికలలోని ఒక హెచ్చరిక ఇది."

(ఖుర్‌ఆన్ 53 : 56)

"నీవు నిశ్చయముగా దైవ ప్రవక్తలలోని వాడవు." *(ఖుర్‌ఆన్ 36 : 1)*

వారితో ఇలా అను, "నేను కొత్త ప్రవక్తనేమీ కాను. రేపు మీకు ఏమి జరుగనున్నదో, నాకు ఏమి కానున్నదో, నాకైతే తెలియదు. నేను నా వద్దకు పంపబడే దైవవాణి (వహీ)ని మాత్రమే అనుసరిస్తున్నాను. నేను స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి తప్ప మరేమీ కాను." *(ఖుర్‌ఆన్ 46 : 9)*

"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు." *(ఖుర్‌ఆన్ 3 : 144)*

అంతేకాదు. ఇంకో వాస్తవాన్ని కూడ స్పష్టంగ తెలియజేసింది. ప్రారంభం నుండి ప్రతి సత్య సందేశదాత ఇచ్చిన పిలుపునే ఈ అరబ్బీ ప్రవక్త మహనీయ ముహమ్మద్ (స) అందజేస్తున్నారని, దేవుని ప్రవక్తలందరూ ప్రబోధించిన సహజ ధర్మాన్నే ఆయనా ప్రబోధిస్తున్నారని కూడా చెప్పివేసింది.

ఇలా ప్రకటించండి : "మేమంతా అల్లాహ్‌నూ, ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్నీ విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబు, యాఖూబు సంతానంపై అవతరించినదానినీ, మూసాకూ, ఈసాకూ ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానినీ మేము విశ్వసించాము. వారిలో ఏ ఒక్కరిపట్లా మేము భేదభావం చూపము. మమ్మల్ని మేము ముస్లిములుగా అల్లాహ్‌కు సమర్పించుకున్నాము." *(ఖుర్‌ఆన్:2:136)*

దివ్య ఖుర్‌ఆన్ ప్రకటించిన ఈ వివరణ వల్ల సందేహ రహితంగా తెలుస్తున్నదేమంటే, మహనీయ ముహమ్మద్ (స) వచ్చింది పూర్వపు ప్రవక్తల్లో

ఒకరిని తిరస్కరించడానికో, వారిలో ఒకరు ప్రబోధించిన సందేశాన్ని ఖండించ డానికో కాదు. పూర్వం నుండి అన్ని జాతుల ప్రవక్తలు ప్రబోధించిన సత్య ధర్మంలో ప్రజలు చేసిన మార్పులు, చేర్పుల మాలిన్యాన్ని ప్రక్షాళనంచేసి ఆ నిజధర్మాన్ని తిరిగి ప్రజలకు అందజేయడానికి వచ్చారాయన.

4. ఈవిధంగ దివ్య ఖుర్‌ఆన్ తనను అందజేసిన వ్యక్తి నిజస్థితిని విశదపరచిన తరువాత విశ్వప్రభువు ఆయనను ఏ కార్య నిర్వహణకోసం పంపాడో వాటిని వివరంగ తెలుపుతుంది.

ఆ కార్యాలు ప్రధానంగ రెండు శాఖలకు సంబంధించినవి. ఒకటి జ్ఞానబోధన, రెండవది ఆచరణ.

మొదటి శాఖ పనులు ఇవి:

1. ఆయత్‌ల పఠనం, ఆత్మల శుద్ధీకరణ, గ్రంథం వివేచనల ప్రబోధన.

"వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు: స్వయంగా వారినుండే వారి మధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయతులను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ నేర్పుతాడు. వాస్తవానికి వారు ఇంతకు పూర్వం స్పష్టమయిన అపమార్గాలలో పడివున్నారు." *(ఖుర్‌ఆన్ 3 : 164)*

ఆయత్‌లను పఠించడం అంటే దేవుని ఆదేశాల్ని, ఆజ్ఞల్ని ఉన్నవి ఉన్నట్లుగా వినిపించడం, ఆత్మల శుద్ధీకరణ అంటే ప్రజల నైతికతను వారి జీవితాన్ని చెడు లక్షణాలు, దురాచారాలు, దుష్టవిధానాల నుండి ప్రక్షాళనం గావించడం. వారిలో మంచి లక్షణాలను, పరిశుద్ధ నైతికతను, సవ్యమైన విధానాలను పెంపొందించడం. గ్రంథ వివేచనల ప్రబోధన అంటే దైవగ్రంథాన్ని దాని ఆశయం, ఉద్దేశ్యాలను విడమర్చి ప్రజలకు అవగత పరచడం, వారిలో విచక్షణా పటిమను పెంపొందించి వారు గ్రంథ సారాన్ని గ్రహించేలా చేయడం.

వారు తమ జీవితంలోని సమస్త విభిన్న, విస్తృత కోణాలను దైవగ్రంథం ప్రకారం మలచుకోగలిగే వివేచనను వారికి నేర్పడం.

2. ధర్మపరిపూర్ణత : "ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేశాను. మీ కొరకు ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీక రించాను."*(ఖుర్‌ఆన్ 5 : 3)*

మరోవిధంగా ఖుర్‌ఆన్‌ను అవతరింపచేసిన ప్రభువు దాన్ని మానవులకు అందజేసిన ప్రబోధకుని చేత కేవలం ఆయత్‌లను వినిపించడం, ఆత్మలను పరిశుద్ధపరచడం, గ్రంథం వివేచనల ప్రబోధన చెయ్యడం లాంటి సేవ మాత్రమే తీసుకోలేదు, ఆ సజ్జనుని ద్వారానే ఆ మహత్కార్యాన్ని కూడా పరిపూర్ణం కానిచ్చాడు. మానవాళికి చేరవేయవలసిన ఆయత్‌లను అన్నింటినీ ఆయన ద్వారానే పంపించాడు. మానవ జీవితం నుండి ప్రక్షాళనం చేయవలసిన చెడులనన్నింటినీ ఆయన ద్వారానే దూరం చేయించాడు. వ్యక్తుల్లోనూ, సమాజంలోనూ ఎంతో గొప్పగా, పరిఢవిల్లవలసిన సదాచారాలను, సత్కార్యాలను ఆదర్శవంతంగా ఆయన మార్గదర్శకత్వంలో నిర్వహింపచేసి చూపించాడు. గ్రంథం వివేచనల బోధన ఆయన ద్వారానే అందజేయించి రాగల సర్వకాల, సర్వావస్థల్లో గ్రంథాశయం ప్రకారం మానవ జీవిత సౌధాన్ని అపురూపంగా నిర్మించుకోగలిగేలా చేశాడు.

3. పూర్వపు ప్రవక్తల అనుయాయులకు, సత్య ధర్మానికి మధ్యన ఉత్పన్నమైన విభేదాల వాస్తవాన్ని విస్పష్టపరచి, తెరలన్నింటినీ తొలగించి, మార్పులు, చేర్పుల్ని వేరుచేసి, చిక్కుముడులను విడదీసి దేవుని ప్రసన్నతను పొందే ఏకైక మార్గాన్ని రుజుమార్గాన్ని తేటతెల్లపరచడం.

"దేవుని తోడు, ప్రవక్తా! నీకు పూర్వం కూడా ఎన్నో జాతులవద్దకు మేము ప్రవక్తలను పంపివున్నాము. (పూర్వం కూడా ఇలాగే జరుగుతూ ఉండేది). షైతాన్ వారి చెడ్డపనులను వారికి మనోహరమైనవిగా చేసి చూపాడు. (కాబట్టి ప్రవక్తల మాటను వారు నమ్మలేదు) ఆ షైతానే ఈనాడు వీరికి కూడా సంరక్ష

కుడై కూర్చున్నాడు. వీరు వేదనా భరితమైన శిక్షకు అర్హులవుతున్నారు. మేము ఈ గ్రంథాన్ని నీపై ఎందుకు అవతరింపజేశామంటే, వారు గురిఅయిన విభేదాల యథార్థాన్ని నీవు వారికి స్పష్టం చెయ్యాలని. ఈ గ్రంథం తనను విశ్వసించే వారికోసం మార్గదర్శకత్వంగానూ, కారుణ్యంగానూ అవతరించింది."

(ఖుర్‌ఆన్ 16 : 63 - 64)

"గ్రంథప్రజలారా! మా ప్రవక్త మీ వద్దకు విచ్చేశాడు. మీరు కప్పిపుచ్చుతూ ఉండిన దైవగ్రంథంలోని ఎన్నో విషయాలను ఆయన మీముందు బహిర్గతం చేస్తున్నాడు. ఇంకా ఎన్నో విషయాలను వదిలివేస్తున్నాడు. మీవద్దకు అల్లాహ్ తరఫునుండి కాంతి వచ్చేసింది. సత్యం వైపునకు మార్గంచూపే ఒక గ్రంథం కూడా. దాని ద్వారా అల్లాహ్ తన సంతోషం పొందగోరేవారికి శాంతి పథాలను చూపుతాడు. తన ఇచ్ఛానుసారం వారిని చీకట్ల నుండి వెలికితీసి వెలుగు వైపు నకు తీసుకువస్తాడు. ఇంకా వారిని రుజుమార్గం వైపునకు నడుపుతాడు."

(ఖుర్‌ఆన్ 5 : 15, 16)

4. అవిధేయులను హెచ్చరించడం, విధేయులకు దైవకారుణ్యం ప్రాప్తమయ్యే శుభవార్త నివ్వడం, దైవధర్మసందేశం విస్తృతపరచడం.

"ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి, శుభవార్తను ఇచ్చేవానిగా, హెచ్చరికచేసేవానిగా చేసి అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలుపు ఇచ్చేవానిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాము." *(ఖుర్‌ఆన్ 33 : 45)*

రెండవ శాఖ క్రియాత్మకమైన జీవితం, దాని వ్యవహారాలకు సంబంధిం చినది. ఆ కార్యం వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిని పెంచడం, చెడును నిర్మూలించడం, ధర్మం (హలాల్), అధర్మం (హరామ్) పరిధుల్ని నెలకొల్పడం. మానవుణ్ణి అల్లాహ్ తప్ప ఇతరులు విధించిన నిబంధనాలనుండి విముక్తి కలిగించడం, వారు మోపిన భారాలను తొలిగించి తేలికపరచడం.

"అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడునుండి నిరోధిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడివున్న బరువులను దించుతాడు. వారు బంధింపబడి ఉన్న శృంఖలాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించీ సమర్థించీ అతనికి సహకరించీ అతనిపై అవతరింపజెయ్యబడిన జ్యోతిని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు." *(ఖుర్‌ఆన్ 7 : 157)*

ప్రజల మధ్య సత్యం, న్యాయాల రీత్యా తీర్పుచేయడం.

"ప్రవక్తా! అల్లాహ్ నీకు చూపిన రుజుమార్గానికి అనుగుణంగా నీవు ప్రజల మధ్య తీర్పు చెయ్యటానికి మేము ఈ గ్రంథాన్ని సత్యంతో నీ వద్దకు పంపాము. నీవు నీతిలేనివారి తరఫున వాదిగా నిలబడకు." *(ఖుర్‌ఆన్ 4 : 105)*

మానవ జీవన వ్యవస్థ పూర్తిగా అల్లాహ్ విధేయతలో సాగేలా దానికి ప్రతిగా సకల వ్యవస్థలు అణగిమణిగి ఉండేలా దైవధర్మాన్ని సుస్థాపితం చేయడం.

"అల్లాహ్‌యే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్య ధర్మాన్నీ ఇచ్చి పంపాడు, అది అన్ని ధర్మాలపై ఆధిక్యం కలిగి ఉండేలా చేయటానికి."
(ఖుర్‌ఆన్ 48 : 28)

ఈ విధంగా ప్రవక్త కార్యనిర్వహణకు సంబంధించిన ఈ శాఖ రాజకీయ, న్యాయ, నైతికత, సంస్కృతీ నాగరికతలకు సంబంధించిన అన్ని కోణాలపైన అది ఆధిక్యతను పొందుతుంది.

5. దైవప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన ఈ కార్యం ఓ జాతి లేక ఓ దేశం లేక ఓ కాలానికి ప్రత్యేకించింది కాదు. యావత్ మానవాళికి, సర్వకాలాలకు వర్తిస్తుంది.

"(ప్రవక్తా!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను ఇచ్చేవాడుగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. కాని చాలా మంది మానవులు దీనిని ఎరుగరు." *(ఖుర్‌ఆన్ 34 : 28)*

ముహమ్మద్! ఇలా ప్రకటించు: "మానవులారా! నేను మీ అందరివైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను - అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు- అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో."

(ఖుర్ఆన్ 7:158)

"ఈ ఖురాను నా వద్దకు వహీద్వారా పంపబడింది. మిమ్మల్నీ, ఇది ఎవరెవరివద్దకు చేరుతుందో వారందరినీ నేను హెచ్చరించాలని."

(ఖుర్ఆన్ 6 : 19)

"ఇది సకల లోకాల వారికొరకు ఒక హితోపదేశం, మీలో రుజుమార్గాన నడవదలచిన ప్రతి వ్యక్తికొరకు." *(ఖుర్ఆన్ 81 : 29)*

6. ముహమ్మద్ (స) దైవదౌత్యానికి గల మరో ప్రధాన లక్షణాన్ని దివ్య ఖుర్ఆన్ వ్యక్తం చేస్తుంది. దైవప్రవక్తలు, దైవసందేశహరుల పరంపర ఆయనతో అంతమయిపోయింది. ఇక ప్రపంచానికి మరో ప్రవక్త అవసరం లేదు.

"(మానవులారా!) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రి కారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తంచేసే చివరివారు." *(ఖుర్ఆన్ 33 : 40)*

ముహమ్మద్ ప్రవక్తా బాధ్యతలు విశ్వవ్యాప్తమైనవీ, శాశ్వతమైనవీ కావడం చేతను, ధర్మం పరిపూర్ణమవడం వల్లనూ తప్పనిసరిగా కాగల పరిణామం ఇదే. పైన ఉదాహరించిన ఖుర్ఆన్ వివరణల ప్రకారం ముహమ్మద్ (స) ప్రవక్తా బాధ్యతలు ప్రపంచ ప్రజలందరికీ వర్తిస్తాయి, ఒకే జాతికి పరిమితం కావు. ప్రవక్తల అవతరణకు కారణభూతమయిన కార్యం కూడా ఆయన ద్వారా

పూర్తి గావించబడింది. అందువల్ల ఆయనతో దైవదౌత్య పరంపర అంతమవడం పూర్తిగా సహేతుకమయింది. ఈ విషయాన్ని ప్రవక్త (స) అత్యుత్తమ శైలిలో ఒక ప్రవచనంలో స్పష్టీకరించారు.

"ప్రవక్తలలో నా దృష్టాంతాన్ని ఇలా చెప్పవచ్చు: ఒక వ్యక్తి ఒక సుందర మైన కట్టడాన్ని నిర్మించాడు. అందులో కేవలం ఒక ఇటుక పట్టేంత స్థలాన్ని వదిలేశాడు. ఆ కట్టడం చుట్టూ తిరిగే ప్రజలకు ఆ ఖాళీ స్థలం ప్రశ్నార్థకంగా నిలిచింది. ఒకవేళ ఈ ఆఖరు ఇటుకను కూడ పెట్టి ఉంటే కట్టడం పూర్తి అయి పోయేదని ప్రజలు అన్నారు. దైవదౌత్యపు కట్టడంలో ఖాళీగా ఉన్న స్థలంలోని ఆ అఖరు ఇటుకను నేనే. ఇక ఇప్పుడు నా తర్వాత మరే ప్రవక్త రాబోడు."

ఈ ఉపమానం వల్ల దైవదౌత్యం అంతానికి కారణం స్పష్టంగ అర్థమై పోతుంది. దైవధర్మం పరిపూర్ణమయింది. దైవసూక్తులు పూర్తిగ ప్రకటిత మయ్యాయి. విధినిషేధాలు, విశ్వాసాలు, ఆరాధనలు, సంస్కృతి, సభ్యతలు, నాగరిక సామాజిక విషయాలు, ప్రభుత్వ రాజకీయ వ్యవహారాలు- ఒకటేమిటి జీవితంలోని సకల రంగాలలోని ప్రతి అంశం గురించిన సమస్త ఆజ్ఞలు విశదంగా ప్రకటించబడ్డాయి. దైవవాణి, దైవప్రవక్త పవిత్ర జీవిత చరిత్ర ఎలాంటి మార్పులు, చేర్పులకు దూరంగా అందజేయబడ్డాయి. ప్రతి కాలంలోనూ దానిద్వారా రుజుమార్గాన్ని పొందవచ్చు. కాబట్టి ఇక ప్రవక్త అవసరం లేదు. కేవలం ధర్మపునరుజ్జీవనం, సంస్మరణల అవసరముంటుంది. దానికి సత్య ప్రియులైన ధర్మవేత్తలు, విశ్వాసులు కలసిన సదాచార సమాజం మాత్రమే అవసరం.

7. చివరగా ఒక ప్రశ్న మిగులుతుంది. ఈ గ్రంథాన్ని అందజేసిన వ్యక్తి నైతిక లక్షణాలు వ్యక్తిగత స్థాయిలో ఎలా ఉండేవి?

ఈ ప్రశ్నకు సమాధానంగ దివ్య ఖుర్ఆన్ ఇతర గ్రంథాలవలె దానిని తీసుకువచ్చిన వ్యక్తిని అతిశయ వాచకాలతో పొగడలేదు. ఆయన ప్రశంసను

చర్చనీయాంశంగ ఎంచనే లేదు. అయితే సందర్భానుసారం సూచన ప్రాయంగ ఆయన (స) నైతిక ప్రత్యేకతలను వ్యక్తం చేసింది. దానివల్ల ఆయన పవిత్ర వ్యక్తిత్వంలో అత్యుత్తమ మానవీయ లక్షణాలు పరిపూర్ణంగా ఉండేవని తెలుస్తుంది.

1. దివ్య ఖుర్‌ఆన్‌ని అందజేసిన వ్యక్తి నైతికత రీత్యా అత్యంత ఉన్నత స్థానంలో ఉన్నాడని అది స్పష్టం చేస్తుంది :

"నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు."

(ఖుర్‌ఆన్ 68 : 4)

2. దాన్ని అందజేసిన వ్యక్తి వజ్ర సంకల్పుడు, స్థిరచిత్తుడు. ఎట్టి పరిస్థితిలోనూ దేవునిమీద నమ్మకం సడలని వ్యక్తి అని అది స్పష్టంచేస్తుంది. ఆయన జాతి అంతా కలసి ఆయనను అంతం చేయాలని కుట్ర పన్నినప్పుడు, ఆయన కేవలం ఒక సహచరునితోపాటు ఒక గుహలో తలదాచుకోడానికి గత్యంతరం లేని స్థితికి గురయినప్పుడు - అంతటి కఠిన కష్టకాలంలో కూడ ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. తన నిశ్చయం మీద స్థిరంగ నిలబడ్డారు.

"అవిశ్వాసులు అతనిని బహిష్కరించినపుడూ అతను కేవలం ఇద్దరిలో రెండోవాడుగా ఉన్నప్పుడూ, వారిద్దరూ గుహలో ఉన్నప్పుడూ అతడు తన స్నేహితునితో, 'విచారపడకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు' అని అన్న ప్పుడూ అల్లాహ్ అతనికి సహాయం చేశాడు." *(ఖుర్‌ఆన్ 9 : 40)*

3. దాన్ని అందజేసిన మహనీయుడు అత్యంత విశాలహృదయుడు, ఉదార స్వభావుడైన మానవుడని అది వ్యక్తం చేస్తుంది. తన బద్ధశత్రువులను సైతం క్షమించమని, వారి కోసం దైవాన్ని వేడుకున్నాడు, కడకు అల్లాహ్, వారిని క్షమించనని తన చివరి తీర్పు వినిపించవలసి వచ్చింది.

"ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయకపోయినా (ఒకటే); ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా

డెబ్బైసార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు."
(ఖుర్ఆన్ 9 : 80)

4. దాన్ని అందజేసిన వ్యక్తి అత్యంత మృదుస్వభావి అని, ఆయన ఎప్పుడు ఎవరితోనూ కఠినంగా వ్యవహరించలేదని, అందుకే లోకం ఆయన్ని అమితంగా ప్రేమించేదని అది ప్రకటిస్తుంది.

"(ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అనంత కరుణవల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవేగనక కర్కశుడవు, కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుపక్కల నుండి దూరంగా పోయేవారు."
(ఖుర్ఆన్ 3 : 159)

5. దాన్ని అందజేసిన వ్యక్తి ప్రజలు రుజుమార్గాన నడవడానికి తహ తహలాడే వారని, వారు భ్రష్టమార్గాన్నే అనుసరించాలని పట్టుబట్టినప్పుడు ఆయన ఆత్మ క్షోభ అనుభవించేదని, తుదకు వారికోసం కుమిలిపోయేవారని అది వివరిస్తుంది.

"ప్రవక్తా! ఒకవేళ వారు ఈ ఉపదేశాన్ని విశ్వసించకపోతే, బహుశా నీవు వారికోసం దుఃఖిస్తూ నీ ప్రాణాన్నే కోల్పోతావేమో!" *(ఖుర్ఆన్ 18 : 6)*

6. దాన్ని అందజేసిన వ్యక్తికి తన సమాజం పట్ల ఎనలేని ప్రేమానురాగాలు ఉండేవని, దాని శ్రేయస్సు ఆకాంక్షలో, దాని నష్టం ఆవేదనలో పరితపించేవారని, ఆ సమాజ ప్రజలపట్ల అపరిమితమైన వాత్సల్యం, కారుణ్యం కలిగి ఉండేవారని అది విశదీకరిస్తుంది.

"మీవద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు." *(ఖుర్ఆన్ 9 : 128)*

7. దాన్ని అందజేసిన వ్యక్తి కేవలం తన జాతికే కాదు, యావత్ ప్రపంచానికి ఆయన దేవుని కారుణ్యమని అది స్పష్టం చేస్తుంది.

"ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము." *(ఖుర్‌ఆన్ 21 : 107)*

8. దాన్ని అందజేసిన వ్యక్తి రాత్రిళ్ళు గంటల తరబడి అల్లాహ్‌ను ఆరాధిస్తూ, దేవుని సంస్మరణలో నిల్చుంటాడని అది చాటుతుంది.

"ఓ ప్రవక్తా! నీవు ఒక్కొక్కప్పుడు దాదాపు మూడింట రెండువంతుల రాత్రి, మరొకప్పుడు సగం రాత్రి, ఇంకొకప్పుడు మూడింట ఒకవంతు రాత్రి ఆరాధనలో నిలబడి ఉంటావనీ, నీ సహచరులలో కూడ ఒక వర్గం ఇలాగే చేస్తుందనీ నీ ప్రభువుకు తెలుసు." *(ఖుర్‌ఆన్ 73 : 20)*

9. దాన్ని అందజేసిన వ్యక్తి ఒక సత్యసంధుడైన మానవుడు. తన జీవితంలో ఎప్పుడూ సత్యమార్గాన్ని విడనాడలేదు. దురాలోచనలకు ఎన్నడూ తావివ్వలేదని, ఎప్పుడూ మనోవాంఛలకు అనుగుణంగ, సత్యానికి విరుద్ధంగ ఒక్క పలుకు కూడ పలుకలేదని అది ప్రకటిస్తుంది.

"అతను తన మనోవాంఛలను అనుసరించి చెప్పటం లేదు."
(ఖుర్‌ఆన్ 53 : 2)

10. దాన్ని అందజేసిన వ్యక్తి వ్యక్తిత్వం ప్రపంచ మానవాళి అంతటికీ అనుసరణీయమయిన ఆదర్శమని, ఆయన పూర్ణజీవితం నైతిక పరిణతికి వాస్తవమైన ప్రమాణమని అది వెల్లడిస్తుంది.

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది." *(ఖుర్‌ఆన్ 33 : 21)*

దివ్య ఖుర్‌ఆన్ అధ్యయనంవల్ల ఖుర్‌ఆన్ ప్రబోధకుని ఇంకా ఎన్నో ప్రత్యేకతలు కానవస్తాయి. కాని ఈ వ్యాసంలో వాటి వివరణకు అవకాశం లేదు.

నేటి మత గ్రంథాలకు భిన్నంగా, ఈ గ్రంథం తనను అందజేసిన వ్యక్తిని ఎలా పరిచయం చేస్తుందో దివ్య ఖుర్ఆన్ని అధ్యయనం చేసే ప్రతి వ్యక్తికి ద్యోతకమవుతుంది. ఆ పరిచయం ఎంతో స్పష్టంగా సకల మాలిన్యాలకు దూరంగా కానవస్తుంది. ఆయనలో దైవత్వపు ఛాయలు కూడా కానరావు. ప్రశంసలు, అణువంత అతిశయోక్తి వినిపించదు. అసాధారణమైన శక్తులు ఉన్నట్లు ఆపాదించడం జరగలేదు. దేవుని కార్యకలాపాల్లో ఆయనకు భాగస్వామ్యం ఉన్నట్లు ప్రకటించదు. ఒక సత్య సందేశకుని, ఒక నాయకుని స్థాయికి తగని ఏ బలహీనతనూ ఆపాదించదు. ఇస్లామీయ సాహిత్య గ్రంథాలన్నీ ప్రపంచం నుండి లుప్తమయిపోయినా, కేవలం ఒక్క దివ్య ఖుర్ఆన్ మాత్రమే మిగిలి ఉన్నా చాలు. ప్రవక్త (స) వ్యక్తిత్వం గురించి ఏ అపోహగాని, ఏ అపార్థంగాని ఏ సందేహాస్పద విషయంగాని, ఆయనకు సంబంధించిన విశ్వాసంలో ఏ దోషంగాని ఏర్పడే తావుండదు. ఈ గ్రంథాన్ని అందజేసిన వ్యక్తి ఒక పరిపూర్ణ మానవుడని, అత్యుత్తమ నైతిక లక్షణాలతో భాసిల్లేవాడని, పూర్వపు ప్రవక్తల్ని రూఢీపరిచే వాడని, ఏ క్రొత్త మతాన్నీ స్థాపించలేదని. మానవాతీత శక్తులేవీ తనలో ఉన్నట్లు ప్రకటించుకోలేదని, ఆయన సందేశం యావత్ ప్రపంచానికి వర్తించేదని ఆయన్ని అల్లాహ్ కొన్ని ప్రత్యేక సేవల కోసం నియమించాడని, ఆయన ఆ సేవల్ని పరిపూర్ణంగ నిర్వహించిన తరువాత దైవదౌత్య పరంపర ఆయన వ్యక్తిత్వంతోనే అంతమయి పోయిందని ఈ గ్రంథం వల్ల నేటికీ తెలుసుకోగలము.

- సమాప్తం -